క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

గండేడ్: గ్రామాల్లో పార్టీ బలోపేతానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని పీసీసీ మెంబర్ నరసింహారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పగిడ్యాల్, బల్సూర్‌గొండ, పంచాంగల్‌తండా, కొండాపూర్, మన్సూర్‌పల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు శంకరయ్య, ప్రధాన కార్యదర్శి వెంకన్న, ఎస్టీసెల్ అధ్యక్షుడు కోట్యా నాయక్, కృష్ణారెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ బోల్తా

జడ్చర్ల:అక్రమంగా ఫిల్టర్ ఇసుకను తయారు చేసి తరలిస్తుండగా అకస్మాత్తుగా బోల్తా పడిన సంఘటన రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి– రాయపల్లి రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. కొంత కాలంగా ఈ ప్రాంతంలో అక్రమంగా పెద్ద ఎత్తున ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నారు.ఇసుక తయారీ కోసం వివిధ ప్రాంతాల నుంచి భారీగా మట్టిని డంప్ చేస్తూ ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇసుక టిప్పర్ బోల్తా పడింది. ప్రమాదంలో ఎవరికి ప్రాణహాని జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.ఫిల్టర్ ఇసుక తయారీదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రజలు పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి

కోయిల్‌కొండ: రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కాళప్ప అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో ఇచ్చిన గడువులోగా మొక్కలు నాటేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాజీ, ఏపీఎం మల్లేష్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

ఎల్కిచర్లలో ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించాలి

భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్లలో స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ రిజర్వేషన్ టికెట్‌ను ఎస్సీలకు కేటాయించాలని బుధవారం ఎంపీ డీకే అరుణకు ఎస్సీ నాయకులు వినతిపత్రం అందజేశారు. భూత్పూర్ సమీపంలోని ఓ పెట్రోల్‌బంక్ సమీపంలో ఎంపీ డీకే అరుణతో మాట్లాడారు. కార్యక్రమంలో యాదయ్య, మిద్దె చెన్నయ్య, కుమ్మెర కృష్ణయ్య, ఎన్.నర్సింహులు, తిరుపతయ్య, రాము పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయం

హన్వాడ: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ఏకైక ధ్యేయంగా పీఆర్‌టీయూ టీఎస్ సంఘం పనిచేస్తుందని ఆసంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, విజయానంద్‌రెడ్డిలు పేర్కొన్నా రు. బుధవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో పీఆర్‌టీయూ టీఎస్ సంఘం సభ్యత్వనమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నదర్పల్లి, పెద్దర్పల్లి, కొత్తపేట, హన్వాడ, ఇబ్రహీంబాద్, ఎనెమీది తండా, పిల్లిగుండుతండా పాఠశాలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కుర్మన్న, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, నర్సింహారెడ్డి, పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

కోయిల్‌కొండ:ఫర్టిలైజర్ షాపుల యజమానులు నా ణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు విక్రయించాలని వ్యవసాయ సహాయసంచాలకులు రాంపాల్ అన్నారు. బుధవారం మండలంలోని ఫర్టిలైజర్ షాపులను ఆయన తనిఖీ చేశారు. డీలర్లు కృత్రిమంగా ఎరువుల కొరత సృష్టించకుండా చూడాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి యమారెడ్డి ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మహబూబ్‌నగర్ రూరల్: మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రతివారం ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ నిర్వహించే సమావేశాన్ని మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు బహిష్కరించారు. ప్రభుత్వం తమకు వేతనాలు ఇవ్వకపోవడం వల్ల కుటుంబాల జీవన విధానం రోజురోజుకు ఛిన్నాభిన్నమవుతుందన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీడీఓ కరుణశ్రీకి ఫీల్డ్ అసిస్టెంట్లు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు వెంకట్‌నాయక్, బాబురావు, భగవంతు, శాంతయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళా శక్తి సంబరాలు

దేవరకద్ర: దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్‌లో గురువారం ఉదయం 11 గంటలకు ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహిస్తున్నట్లు మండల అధికారులు తెలిపారు. దేవరకద్ర, భూత్పూర్, అడ్డాకుల, మూసాపేట, చిన్నచింతకుంట మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులు హాజరు అవుతారని తెలిపారు. కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు.

మెనూ అమలుకు తిలోదకాలు


మిడ్జిల్ కేజీబీవీలో ఎంపీడీఓ సమక్షంలో విద్యార్థులకు పులిహోర పెడుతున్న సిబ్బంది

- సమయానికి భోజనం, టిఫిన్ లేవు
- విషయం బయట చెప్పితే టార్గెట్ చేస్తారు
- అధికారుల తనిఖీలో గోడు వెల్లబోసుకున్న కేజీబీవీ విద్యార్థినులు

మిడ్జిల్: మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులు, సరైన భోజనం లేక ఇబ్బంది పడుతున్న విషయం బుధవారం ఉదయం ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఆకస్మికంగా చేసిన తనిఖీలో వెల్లడించారు. మంగళవారం రాత్రి ముగ్గురు విద్యార్థినులు గోడదూకి పారిపోయే ప్రయత్నం చేయడంతో జిల్లా అధికారుల ఆదేశం మేరకు ఉదయం 7.30లకు ఎంపీడీఓ గీతాంజలి, తమ సిబ్బందితో పాఠశాలకు వెళ్లి విద్యార్థినులకు డికాషన్ పోశారు. మెనూ ప్రకారం బూస్టు పాలు ఇవ్వాలి కాని, పాలు లేవని డికాషన్ పోశారు. 8.30గంటలకు పెట్టాల్సిన టిఫిన్ 9 గంటలకు అధికారుల ముందే విద్యార్థినులకు పెట్టారు. విద్యార్థినులతో ఎంపీడీఓ ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు సేకరించారు. కొందరు విద్యార్థినులు తమ పేరు చెబితే ఇబ్బంది పెడుతారని, దయచేసి తమపేరు చెప్పకపోతే నిజాలు చెబుతామని ఎంపీడీఓకు వివరించారు,. మెనూ ప్రకారం భోజనం, టిఫిన్స్ పెట్టడం లేదని, నాణ్యత లేని భోజనం పెడుతున్నా తప్పక తినవలిసి వస్తుందని, ఇక్కడ భోజనం సరిగా లేక విద్యార్థినులు పారిపోవాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పేర్లు చెప్పొద్దని వేడుకున్నారు. రోజు ఉదయం 9 గంటల తర్వాత టిఫిన్, 2గంటల తర్వాత భోజనం పెడుతున్నారని, ఈవిషయం తాము ఎవరికి చెప్పకోలేమన్నారు. ఈ విషయంపై వంట చేసే వారిని అడుగగా, టీచర్లు ఇచ్చింది వండి పెడుతున్నామని సమాధానం ఇచ్చారు. మేము ఏమి చేయగలం అనే సమాధానం ఇచ్చారు. ఈ విషయం ఎంపీడీఓ తనిఖీ రిజిస్టర్‌లో రాశారు. ఈ విషయంపై ప్రత్యేకాధికారిణి కవితను వివరణ కోరగా భోజనాలు కొంత ఆలస్యమవుతున్నాయని, మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నామని, గత వారంలో గుడ్లు సరిగా రాలేదని వివరణ ఇచ్చారు. మిడ్జిల్ కేజీబీవీపైన జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోని ఆకస్మికవ తనిఖీలు నిర్వహించి విద్యార్థినీలకు మెరుగైన భోజనం, అందించే విధంగా చూడాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి


మూసాపేటలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

అడ్డాకుల: ఉపాధిహామీలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మూసాపేట మండల కేంద్రంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీఓ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. వారాంతపు సమీక్ష సమావేశాన్ని బహిష్కరిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు అందక తమ కుటుంబాలకు పూట గడవటం కూడా కష్టంగా మారిందని వాపోయారు. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు మానసికంగా బలహీనపడి చికిత్స చేయించుకునే పరిస్థితి లేక ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించి పెండింగ్‌లో ఉంచిన మూడు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు చంద్రశేఖర్‌గౌడ్, రామకృష్ణ, యాదయ్యగౌడ్, శ్రీలత, కాశీం, కృష్ణ, మన్నెమ య్య, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

75 రేషన్ కార్డులు మంజూరు

మిడ్జిల్: ప్రజాప్రభుత్వం నూతనంగా మిడ్జిల్ మండలానికి 75 రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తహసీల్దార్ యూపీ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా 1108 మందిని కార్డులలో చేర్చడం జరిగిందని, వారికి రేషన్ అదనంగా రేషన్ వస్తుందని తెలిపారు.

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి

మహబూబ్‌నగర్ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్య, ఉద్యోగాలలో 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ఆమోదించాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ బిల్లు అమలు కోసం కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్టికల్–9లో చేర్చి సహకరించాలన్నారు. ఈనెల 21న ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాలలో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. సమావేశంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్‌చారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూ హక్కుల సాధనకు రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న దళితులను అరెస్టు చేస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్ రూరల్: భూమి సాగు చేసుకునే సమయంలో కందకాలు తవ్వి ఫారెస్టు అధికారులు తమ నోట్లో మట్టి కొట్టారని ఏనుగొండ సర్వేనంబర్ 431, 431/1, 433 అసైన్డ్ భూముల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రిలే నిరాహార దీక్షలో భాగంగా మూడో రోజు తెలంగాణ చౌరస్తాలో రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపై బైఠాయించడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుపై వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ మాట్లాడుతూ ఫారెస్టు అధికారులు తమపై దౌర్జన్యానికి దిగడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. తాము వ్యవసాయం చేసిన భూములు తిరిగి అప్పగించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. దీక్షకు బహుజన స్టూడెంగ్ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జుట్ల రవికుమార్, బాలవెంకటయ్య, బడే యాదయ్య, చిన్నయ్య, కొత్త ప్రవీణ్‌కుమార్‌లు మద్దతుగా వచ్చి సంఘీభావం ప్రకటించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



గండేడ్: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని గండేడ్ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెన్నాచేడ్ మాడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గజ్జి, తామర వంటివి సోకిన సమయంలో ఇతరులకు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. వెన్నాచేడ్ ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జక్లపల్లి సబ్‌సెంటర్ మెడికల్ ఆఫీసర్ సునిల్ , సీహెచ్‌ఓ గోపాల్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ యాదమ్మ, హెల్త్ అసిస్టెంట్ గోపాల్, వార్డెన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్ల పంపిణీ


పీపీఈ కిట్లు, ఆయుష్మాన్ కార్డులు అందుకున్న కార్మికులతో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'నమస్తే డే'లో భాగంగా బుధవారం పది మంది పారిశుద్ధ్య కార్మికులకు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్స్ (పీపీఈ) కిట్ల తోపాటు ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టిక్ ట్యాంకులు, మ్యాన్‌హోల్స్, మురుగు కాల్వను శుభ్రం చేసేటప్పుడు వీటిని తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అనుకోకుండా ఏమైనా ప్రమాదాలు జరిగినప్పుడు లేదా అనారోగ్యానికి గురైనప్పుడు ఆయుష్మాన్ కార్డులు ఉప యోగపడతాయన్నారు. పీపీఈ కిట్లలో మాస్క్, గ్లౌజ్, బూట్లు, హెల్మెట్, ఫుల్ బాడీ సూట్ ఉన్నా యి. అనంతరం వీటిని ఎలా ఉపయోగించాలో ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ చరణ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వజ్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభకు నాసా కాంటెస్ట్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే నాసా కాంటెస్ట్ నిర్వహిస్తున్నట్లు శ్రీ చైతన్య స్కూల్ ఏజీఎం భాస్కర్ రెడ్డి అన్నారు. స్థానిక శ్రీ చైతన్య స్కూల్ బీఎస్ఎన్ఎల్ భవనంలో నాసా కాంటెస్ట్ 2024–25కు సంబంధించి పరీక్ష నిర్వహించారు. బధవారం స్కూల్‌లో జీరో జీ ఫామ్స్ ప్రాజెక్టు చేసి రాష్ట్ర స్థాయిలో 2వ బహుమతి గెలుచుకున్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను గ్రూప్‌లుగా విభజించి అంతరిక్షంపై అవగాహన కల్పించే విధంగా విద్యార్థులను ప్రోత్సహించి అమెరికాలో గల నాసా సంస్థానానికి పంపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ కో ఆర్డినేటర్ రఘుబాబు, ప్రిన్సిపాల్ శ్రీధర్, డీన్ మహేష్, అకాడమిక్ సి ఇన్‌చార్జి నౌషిన్, నాసా ఇన్‌చార్జి షాహీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


గాధిర్యాల్‌లో పరిశీలిస్తున్న కేంద్రబృందం

మహమ్మదాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్వచ్ఛసర్వేక్షణ్ అధికారి నవనీత తెలిపారు. బుధవారం మండలంలోని గాధిర్యాల్‌లో స్వచ్ఛసర్వేక్షణ్ అధికారులు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రోడ్లు, డ్రెయినేజీలు, ఇంకుడుగుంతలు, బాత్‌రూంలు, హెల్త్‌సెంటర్, స్కూల్, అంగన్‌వాడీ, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎన్నో నిధులు కేటాయిస్తున్నారని, అలాంటి నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇళ్లముందు మహిళలు పూల, పండ్ల మొక్కలు నాటుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మొక్కను నాటి నీళ్లు పోశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి హజీ, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ రవి ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వైద్యుల ర్యాలీ

పాలమూరు: పట్టణంలో ప్రైవేట్ వైద్యులతో పాటు ఐఎంఏ అధ్యక్షుడిపై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం ఐఎంఏ ఆధ్వర్యంలో ప్రైవేట్ వైద్యులు భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా జనరల్ ఆస్పత్రి ఆవరణ నుంచి ర్యాలీ ప్రారంభం చేసి న్యూటౌన్ మీదుగా అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకున్నారు. వైద్యులపై జరుగుతున్న దాడులపై ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్‌రాంమోహన్, వైద్యులు శ్యాముల్, మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు.

మౌంట్‌బాసిల్ పాఠశాలలో ఎన్‌సీసీ ప్రారంభం


ఎన్‌సీసీ అధికారి ఏకేసింగ్‌కు స్వాగతం పలుకుతున్న డైరెక్టర్ శిరీష, ప్రిన్సిపాల్ సోమశేఖర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండలంలోని మౌంట్‌బాసిల్ పాఠశాలలో బుధవారం నుంచి ఘనంగా ఎన్‌సీసీ ప్రారంభించారు. ఈ మేరకు ఎన్‌సీసీ అధికారులు కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఏకే సింగ్ పాఠశాల ఆవరణలో ఎన్‌సీసీని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఎన్‌సీసీలో పాల్గొనడం వల్ల దేహదారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, దేశభక్తి అలవరుచుకోవచ్చన్నారు. ప్రతి విద్యార్థినీ కూడా ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఎన్‌సీసీ ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు జగార్‌సింగ్, రణ్‌బీర్‌సింగ్, సునీల్‌సింగ్, జీసీఐ శిరీష, చైర్మన్ చంద్రకళ వెంకటయ్య, డైరెక్టర్స్ శిరీష ప్రవీణ్, పూజిత మోహన్‌రెడ్డి, సుశాంత్‌కృష్ణ, ప్రిన్సిపాల్ సోమశేఖర్ రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం రామయ్యబౌళిలో హజ్రత్ షేక్ రఫీయొద్దీన్‌షా ఖాద్రీ దర్గా, హజ్రత్ షేక్ అబ్దుల్ రహెమాన్ హుస్సేన్‌షా ఖాద్రీ షర్ఫీ ఉర్సు మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అసర్ నమాజ్ అనంతరం నాతే షరీఫ్ కార్యక్రమం, గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. పూలు, చాద ర్లు సమర్పించి ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం అల్మాస్ ఫంక్షన్‌హాల్లో 10వ ధార్మికసభ నిర్వహించారు.

ఏఐ బోధనతో విద్యాసామర్థ్యాల పెంపు


జడ్చర్ల ప్రాథమిక పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ను ప్రారంభించిన రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బోధనతో విద్యార్థుల్లో వి ద్యాసామర్థ్యాలు మెరుగుపడుతాయని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా పేర్కొన్నారు. బు ధవారం జడ్చర్ల ప్రాథమిక పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ను ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కంప్యూటర్‌కు సంబంధించిన విషయాల ను చిన్నారులతో కలిసి పంచుకున్నారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టుకొని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తరగతి గదిలో 5వ తరగతికి చెందిన విద్యార్థిని స్మృతి క కొద్దిసేపు ఉపాధ్యాయురాలిగా మారి బోధించడా న్ని ఆలకించారు. సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చిన వి ద్యార్థిని హర్షితను అభినందించి ఇరువురికి ట్యాబ్‌లను బహుమతిగా అందజేశారు. విద్యాశాఖ డైరెక్టర్ నవీన్‌నికోలస్, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జేడీ లు మదన్‌మోహన్, వెంకట్ నర్సమ్మ, ఆర్‌జేడీ విజయలక్ష్మి, డీఈఓ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ మంజులాదేవి, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

భవిత కేంద్రం సందర్శన

జడ్చర్లలోని ప్రత్యేక అవసరాల విద్యార్థులుగల భవిత కేంద్రాన్ని రాష్ట్ర విద్యా కార్యదర్శి యోగితా రాణా, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఉన్నతాధికారులు సందర్శించారు. దివ్యాంగులకు ప్రభుత్వం సరఫరా చేసిన పరికరాలు ఎంతమేరకు సద్వినియోగమవుతున్నాయని ఆరా తీశారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

నవాబుపేట: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, పేదరిక నిర్మూలనే ఈ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. రేకులచౌడాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. యన్మన్‌గండ్లలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని, జంగమయ్యపల్లిలో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.

ఆర్థికసాయం అందించిన ఎమ్మెల్యే

రాజాపూర్: కుచ్చర్‌కల్ గ్రామానికి చెందిన కుర్వమల్లయ్య చెందిన 15 గొర్రెపిల్లలను మంగళవారం కుక్కలు చంపేశాయి. దీంతో బుధవారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కుచ్చర్‌కల్ గ్రామానికి వెళ్లి కుర్వ మల్లయ్యను పరామర్శించి, రూ.25వేలు అందజేశారు.

డైట్ కళాశాలను సందర్శించిన కార్యదర్శి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలను రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా డైట్ కళాశాలలో నూతనంగా నిర్మిస్తున్న డైట్ కళాశాల భవనాన్ని ఆమె పరిశీలించి నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు కలెక్టర్ విజయేంద్ర బోయి, అధికారులు పాల్గొన్నారు.

షాషాబ్‌గుట్ట పాఠశాల సందర్శన..

జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్ట పాఠశాలను రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా సందర్శించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పీఎం శ్రీ స్కీం కింద ఎంపికైన షాషాబ్‌గుట్ట పాఠశాలలో నిర్మాణాలను పరిశీలించారు. పాలమూరు యూనివర్సిటీని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యాకమిషనర్ దేవసేనలు సందర్శించారు. ఈ సందర్భంగా వైస్‌ఛాన్స్‌లర్ శ్రీనివాస్‌తో వా రు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఇందులో విద్యార్థులు, కోర్సులు, హా స్టల్ వసతులు, సి బ్బంది తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఫార్మసీ కళాశాల, స్పోర్ట్స్ కాంప్లెక్సు, నూతనంగా నిర్మిస్తున్న లా, ఇంజినీరింగ్ కళాశాలలను పరిశీలించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రవీణ, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, పీడీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత ఆర్థికంగా ఎదగాలి


మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

రాజాపూర్(బాలానగర్): ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నంపెట్టే అన్నదాతలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉమ్మడి పాలమూరుజిల్లా డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బాలానగర్ మండల కేంద్రంలోని పీఏసీఎస్ సమావేశపు హాల్లో నిర్వహించిన ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ జిల్లా సహకారం శాఖ వారు రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రసంగించారు. అన్నదాతలను ఎఫ్‌పీఓ ద్వారా మండలంలోని 750 మంది రైతులకు ఒక్కో రైతు రూ.2వేల చొప్పున ఈఎఫ్‌పీఓలో సభ్యత్వం ఇస్తే, రూ.15 లక్షలు జమఅవుతాయన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం రూ.15 లక్షలు ఇచ్చి అన్నదాతలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సేంద్రియ వ్యవసాయం, ఆసక్తి ఉన్న వారికి రైస్‌మిల్, ఆయిల్ మిల్ వంటివి ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా రైతులను అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లాలో ఎఫ్‌పీఓ ద్వారా రైతులు తమ పెట్టుబడికి కేంద్రం మరో రెండువేలు వెంటనే షేర్‌కింద జమచేస్తుందన్నారు. ఎఫ్‌పీఓలో సభ్యత్వం తీసుకోవాలనే రైతులు రూ.2వేలతో పాటు ఆధార్‌కార్డు, రెండుఫొటోలు, రైతుపట్టా పాసుబుక్కును అందజేస్తే పోర్టల్‌లో నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి, ఆడిటర్ టైటస్‌పాల్, మానిటరింగ్ అధికారి శ్రీధర్‌గౌడ్, శ్యామ్‌సుందర్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆధునిక సాగువైపు అడుగులు వేయాలి

- జిల్లా సహకార అధికారి శంకరాచారి


నవాబుపేట సహకార సంఘం కార్యాలయంలో ఎఫ్‌పీఓలో సభ్యత్వం తీసుకుంటున్న రైతులు

నవాబుపేట: ఆధునిక సాగువైపు రైతులు అడుగులు వేయాల్సిన తరుణం ఆసన్నమైందని, అందుకు రైతులే వాటిని సమకూర్చుకుని ముందుకు సాగాలని జిల్లా సహకార సంఘం అధికారి శంకరాచారి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో సంఘం చైర్మన్ నర్సింహులు అధ్యక్షతన జరిగిన రైతు సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. రైతులు ఆధునిక సాగులో ముందుకు సాగాలన్నారు. వారికి అవసరమైన వనరులు, ఎఫ్‌పీఓలు ఏర్పాటు చేసుకుని వారే వివిధ రకాల సాగు యంత్రాలు కొనుగోలు చేసుకుని లాభాలు సాధించవచ్చన్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వ సహకారంలో రాష్ట్రంలోని సహకార సంఘాలు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ పేరుతో ఒక సంఘంగా ఏర్పడి అందులో వారు భాగస్వాములు కావాలన్నారు. అనంతం రైతులకు సంఘంలో సభ్యత్వం అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, మండల వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్, సహకార సంఘం వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సీఈఓ హన్మంత్, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్, అనంతయ్య, డైరెక్టర్లు ప్రతాప్, తహేర్, వెంకటేష్, శశిధర్‌రెడ్డి, గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్మికుల హామీలను అమలు చేయాలి


మాట్లాడుతున్న వెంకటేశ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: గత ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం టీయూసీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక సంక్షేమానికి తమ అధికారంలోకి వస్తే కట్టుబడి ఉంటామని, ప్రభుత్వాలు నేడు కార్మికుల సంక్షేమాన్ని విస్మరించారని ఆరోపించారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని అమలు చేయాలని, తదితర డిమాండ్లపై జూలై 31న జిల్లా కేంద్రాలలో ధర్నాలు, ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సాంబ శివుడు, కొండన్న, డి.అరుణ, జి.వెంకట్ రాములు, బాలు, వెంకటేష్ గౌడ్, కుర్మయ్య, బాలస్వామి, కవిత పాల్గొన్నారు

బోనస్ వెంటనే ఇవ్వాలి

జడ్చర్ల టౌన్: రాష్ట్ర ప్రభుత్వం సన్నవడ్లకు ప్రకటించిన బోనస్ రూ.500 వెంటనే ఇవ్వాలని భారతీయ కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంబీ బాలకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నర్సింగ్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని, ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.